ఒకటి రెండుసార్లు మిస్ అయ్యేది.

నేను మాత్రం ఒకే ఒక్క స్ట్రోక్‌కి అంటించేవాణ్ణి.

ఆ విద్య ఈనాడు ఇలా ఉపయోగపడుతుందని ఎలా ఊహిస్తాను? చుట్టూ జనం ఉన్నారు. పైగా నావైపే చూస్తున్నారు. టెన్షన్.

నేను ఎడమచేత్తో ఒకరాయి పట్టుకున్నాను. కుడిచేత్తో ఒక రాయి, దానికింద గారడీవాడిలా ఎవరికీ కనపడకుండా రెండు అగ్గిపుల్లలు పట్టుకున్నాను.

నా గుండెలో చితి మండుతోంది.

ఆనందరావు చితికి నేను నిప్పు చెయ్యడంవా?

ఇది సంభవంవేనా?

చేతులు వణుకుతున్నాయి.

ఒక్కసారి తలెత్తి చూసేను.

అందరితో పాటు ఆనందరావు కూడా నా మీదికి వంగం చూస్తున్నాడు.

ఇప్పుడతని మొహంలో ఏడుపు లేదు.

నవ్వుతూ, "ఇదే ఆఖరి చూపు కదా" అన్నాడు.

నా గుండెలో మండుతున్న చితికి భూగోళం బద్ధలైంది.

ఆకాశం ఆవిరైపోయింది.

ప్రకృతి స్తంభించిపోయింది. అంతే

అగ్గిపుల్లలున్న రాతితో రెండో దానిమీద "ఠక్"మని కొట్టేను.

భగ్గున మంట వచ్చింది.

నా కంటినుంచి రాలిన కన్నీటి బొట్టు ఆ మంటని ఆర్పకుండా జాగ్రత్తపడి గిర్రున వెనక్కి తిరిగేను.

ఇంక నేను చెయ్యాల్సింది, చూడాల్సింది ఏం లేదు.

చెయ్యకూడనిది చేసేను.

కనీసం చూడకూడనిది చూడదల్చుకోలేదు.

"చెకుముకి రాళ్ళతో చితికి నిప్పెట్టడం థ్రిల్లింగ్‌గా ఉంది కదూ" అంటున్నారెవరో.

**("ఇండియాటుడే" నవంబరు 6-20, 1996)**

# జ్ఞాపకాల నిప్పులు

నరసింగరావ్ !

నిన్ననే కదూ నువ్వెళ్ళిపోయేవు !
నిన్న వయసు ఏడేళ్ళా?
ఈ ఒంటరి బతుక్కి ఏడేళ్ళా?
ఎవరికీ ఉరిశిక్ష వెయ్యలేదే
మరి నాకెందుకింత శిక్ష వేశావు
నీ పేరు తలుచుకుంటేనే
గుండె గోదావరి అయిపోతోందే
ఈనాటికీ ఆరని ఆ కంటి తడి
ఎవరు తుడుస్తారు?
అన్ని బంధాలూ
నీతోనే పోయేయి.
ఇప్పుడింక ఒంటరి పోరాటమే
గెలవాలని లేదు
అర్ధరాత్రి అడుగుల సవ్వడి
నువ్వే నన్న భ్రమ
నిన్ను తెరిస్తే నిప్పులాంటి నిజం
నీ జ్ఞాపకాల నిప్పులు
చల్లారేది నా చితిలోనే
ఎక్కడికో వెళ్ళేవు
ఎప్పుడో వస్తావన్న
ఆత్మవంచనలో బతకలేను
వద్దు. నరసింగరావు. వద్దు
నాకీ నిప్పుల నరకం వద్దు.
నిన్నేనాడూ
ఏ కోరికా కోరలేదు
ఏదీ కావాలనలేదు
ఏదీ కాదనలేదు

కానీ
ఈ ఒక్క కోరికా తీర్చు
చచ్చిపోయిన వాళ్ళు
దేవుడితో సమానమంట
నిన్ను దేవుడిగా ప్రార్థిస్తున్నాను
భగవాన్!
నన్ను తీసుకుపో

**(5.9.1996)**

## నా ఎలిజీ నేనే రాసుకోనా?

**శ**ర్మగారూ ! ఏవిఁటిది?
మీరేదో మంచివారనుకున్నాను
మీరు కూడా ఇలా చేశారేఁవిటీ !
నరసింగరావు వెళ్ళిపోయేడు
రాజేశ్వర్రావూ, రా.వి.శాస్త్రి కూడా వెళ్ళిపోయేరు
మరింక నేనూ వెళ్ళిపోతాను అనుకున్నారా?
బావుందండీ, చాలా వావుంది.
వాళ్లకి బుద్ధి లేకపోతే మీకూ లేదా?
ఇల్లాలి ముచ్చట్లు అంత చక్కగా రాసిన మీరు
మీ ఇల్లాలి మాటేం చేశేరు?
అంతేలెండి. అవన్నీ రాతలే మరి.
వెళిపోండి సార్, వెళిపోండి
మా కన్నీళ్లె వైతరణిగా.
మీకేం మొగమహారాజులు
ఎప్పుడు ఎక్కడికి వెళ్లాలనిపిస్తే అక్కడికి వెళ్ళిపోతారు
"సిరికిం చెప్పడు" పద్ధతిలో
ఔనుమరి విష్ణుమూర్తి మొగాడే కదా!
మీ మొగాళ్లంతా పరమ స్వార్థపరులు సార్
మీ సుఖం, మీ సంగతే చూసుకుంటారు
ఏఁవిటీ! నేనిలా అన్నానని మీ ఫ్రెండ్స్‌తో చెప్తారా?
చెప్పండి. చెప్పాలనే అంటున్నాను.
నాకేం భయంలేదు.
ఏం చేస్తారు?
శాస్త్రిగారు - పరమగడుసు - నవ్వి ఊరుకుంటారు.
రాజేశ్వర్రావుగారు - ఈయన లౌక్యుడు - పోన్లెస్తురూ
ఆడవాళ్లు అంతే - అంటారు
ఇంక నరసింగరావు - పరమ కోపిష్టి - ఇతను
మాత్రం అంతెత్తు ఎగురుతాడు
ఎంత చెప్పినా ఆడపుట్టుక కదా
పౌర్ణమినాడు సముద్రం పొంగినట్టు
గుండెలో బాధ పొంగుతుంటే ఏఁవీఁ చెయ్యలేక
ఏదో అన్నాను. ఏం అనుకోకండేం
పాతతరం వాళ్లం కదా
పట్టుకుని వేలాడుతున్నాం
కట్టుకున్న వాడి చుట్టూ బొంగరంలా తిరిగేం
తాడు తెగిపోయింది. బొంగరం ఆగిపోయింది
అందరం పోకతప్పదు
అదికాదు నా బాధ
నా వాళ్లు అనుకున్న వాళ్లంతా వెళిపోతే
నన్నెవరు పంపిస్తారు!
నన్నింక 'సుందరమ్మగారూ' అని ఎవరు పిలుస్తారు!
నా 'ఎలిజీ' నేనే రాసుకోనా?!

**(24.11.1996)**

## (నూ)రూకలిస్తాను మేకలు కాస్తావా?

**ఇ**దేఁవిటి? ఎండా? నిప్పా?
సూర్యుడు తగలబడిపోతున్నాడా?
పోతే పోనీ. పీడా వదిలిపోతుంది.